# ఆస్తి-నాస్తి

"అన్నయ్యగారు! మీరొక్కసారి మా యింటికి రావాలి!" ఆమె గొంతు కంగారుగా వినిపిస్తున్నది. పుస్తకం చదువుకుంటున్న విశ్వనాథం ఉలిక్కిపడి తలెత్తి చూశాడు.

ఎదురుగా మాధురి! అజంతా శిల్పంలాంటి అందగత్తె ఆమె! శ్రీ మహాలక్ష్మి దేవిలాగా ఒంటినిండా నగలు వేసుకు తిరుగుతుంటే అందరి దృష్టులు ఆమె పైన ఉండేవి. ఆమెని కట్టుకున్న కృష్ణమూర్తిని చూసి అందరూ ఈర్ష్య పడేవాళ్ళు. ఆ మాటకొస్తే కృష్ణమూర్తి దేంట్లోనూ ఆమెకు తీసిపోడు. అందానికి అందం - ఆస్తికి ఆస్తి! గొప్ప వ్యాపారవేత్త!

ముచ్చటగా ఇద్దరు పిల్లలతో ఆ జంట ఆ వాడకే ఆదర్శ జంటలాగా అందరి తలల్లో నాలుకల్లా ఉండేవారు.

"ప్లీజ్! మీరు ఆలశ్యం చెయ్యకుండా వెంటనే రావాలి!" ఆమె కన్నీళ్ళు ఆపుకుంటూ అర్థించింది. విశ్వనాథం ఇంక ఆలశ్యం చెయ్యకుండా కండువా భుజం మీద వేసుకొని బయలుదేరాడు ఆమె వెంట రెండిళ్ళవతల ఆమె ఉంటున్న బంగళా.

ఆ ఇంట్లోకి అడుగు పెడుతూ అడిగాడు "అసలేం జరిగింది?"

"మావారు ఎంతకూ తలుపులు తీయడం లేదు సాయంత్రం నించి బయటికి కూడా రాలేదు!" చెప్పింది.

"ఏం-మీరేమన్న ఘర్షణ పడ్డారా?" భార్యభర్తల మధ్య తగూలు-కొట్లాటలు మామూలే అన్నంత తేలికగా అడిగాడు.

"ఊహు! అదేం లేదు." చెప్పింది.

ఎదురుగా కృష్ణమూర్తి ఆఫీసు గది! ఇంట్లోనే ఒక్క గదిని తన పర్సనల్ వర్క్‌కోసం అట్టిపెట్టుకున్నాడు. అతను ఓ పెద్ద వ్యాపారవేత్త. వేళాపాళ లేకుండా ఫైళ్ళు చూసుకుంటూ వుంటాడు. అందుకని సాయంత్రం బయటకు రాకపోయినా పట్టించుకోలేదట ఆమె.

దబదబ తలుపులు బాదినా జవాబురాలేదు. కిటికీ తలుపలు కూడ మూసివున్నాయి. విశ్వనాథం ఇంక ఆలోచించకుండా తన శక్తినంతా వినియోగించి తలుపులు బద్దలుకొట్టాడు. అతని కృషి ఫలించి తలుపులు విరిగాయి. ఎదురుగా కృష్ణమూర్తి-అచేతనంగా టేబుల్‌మీద తలపెట్టుకొని వున్నాడు. మాధురి గొల్లుమంది.

విశ్వనాథం అతని నాడి చూశాడు. బలహీనంగా కొట్టుకుంటున్నది. టేబుల్ మీద స్లీపింగ్ పిల్సు సీసా కనిపించింది. వెంటనే అతన్ని భుజాన వేసుకుని బయటకు తీసుకొచ్చి - కార్లో పడుకోబెట్టి గౌరిగోపాల్ హాస్పిటల్‌కు తీసుకువచ్చాడు.

కొన్ని గంటల తర్వాత కృష్ణమూర్తికి తెలివి వచ్చింది. "ఎందుకు చేశావు ఈ పని?" విశ్వనాథం అడిగాడు.

"నేను బతికి ఏంలాభం? నాఆస్తి అంతా అప్పులపాలైంది. వ్యాపారంలో ఘోరంగా దెబ్బతిన్నాను. చాలామంది నన్ను మోసం చేశారు. కోటీశ్వరుడైన నేను ఇప్పుడు బికారిని! ఏడ్చాడు.

"అయితే ఆత్మహత్య చేసుకోవా?" అడిగాడు విశ్వనాథం.

"మరి? నాభార్య బిడ్డలు - నేను మునుపటిలా ఎలా బ్రతగ్గలం?"

"చూడు కృష్ణమూర్తి! నువ్వు బ్రతికుంటే కనీసం వాళ్ళకు రెండు పూటలా తిండి పెట్టగలవు - చనిపోతే వాళ్ళను ఎవరు చూస్తారు? అదీగాక ఒక్కసారి చరిత్ర గుర్తుకు తెచ్చుకో? అలెగ్జాండర్ ది గ్రేట్ ఏం పట్టుకుపోయాడు? తన వెంట ఏం తీసుకుపోయాడు?" విశ్వనాథం చెప్పాడు." ఈ ప్రపంచాన్నే జయించాడు అతను. కానీ, అతన జబ్బుపడి చనిపోయేటప్పుడు గ్రహించాడు. తను ఎంత సంపాదించినా తన వెంట ఏమీ పట్టుకుపోవడం లేదని. అందుకే తన చేతులు - ఖాళీ చ ఏతులు బయట పెట్టి - సమాధి చేయించుకున్నాడు. అలెగ్జాండరు కంటే మనం గొప్పవాళ్ళమా?"

కృష్ణమూర్తి అతన్నే చూస్తున్నాడు.

"మనం ఉత్తచేతుల్తో వచ్చామని గుర్తుంచుకుంటే ఈ ఆస్తిపాస్తుల మీద వ్యామోహాలు వుండవు." అంటూ చిన్న ఉపన్యాసం దంచాడు.

"గురు! నాకళ్ళు తెరిపించావు ఇంకెప్పుడూ ఇలాంటి పిచ్చి పని చెయ్యను." కృష్ణమూర్తి చెప్పాడు. కృతజ్ఞతనిండిన కండ్లతో చూసింది శ్రీమతి మాధురి.

**( స్త్రీ స్ఫూర్తి 1994 )**